క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

హవేళిఘణాపూర్(మెదక్): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరం అని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బూర్గుపల్లి, గాజిరెడ్డి గ్రామాల్లో గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫీజొద్దీన్, మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీనివాస్, పరుశురామ్‌గౌడ్, సుభాష్, బాలకృష్ణ, మంజుల, సిద్దాగౌడ్, వెంకటరాములు, వెంకట్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్ పరిశీలన



పాత చెరువు వద్ద బతుకమ్మ ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దామోదర్

చిన్నశంకరంపేట(మెదక్): బతుకమ్మ ఘాట్‌ను చిన్నశంకరంపేట ఎంపీడీఓ దామోదర్ పరిశీలించారు. బుధవారం చిన్నశంకరంపేట పాత చెరువు కట్టపై బతుకమ్మ మెట్ల వద్ద శుభ్రత పనులను పర్యవేక్షించారు.

బహుమతుల అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ

తూప్రాన్: మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే శానిటేషన్ విభాగంలో ఉత్తమ ఉద్యోగి అవార్డులను సైతం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కమిషనర్ ఖాజా మోహియొద్దీన్, కౌన్సిలర్లు పల్లెర్ల జ్యోతిరవీందర్ గుప్త, శ్రీశైలంగౌడ్, భగవాన్‌రెడ్డి, కొడిప్యాక నారాయణగుప్తా, జీఎమ్మార్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి : మాజీ ఎమ్మెల్యే

రామాయంపేట(మెదక్): మంత్రి సురేఖపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పోస్టులు పెట్టిన వారు ఏ పార్టీ వారైనా ఉపేక్షించొద్దన్నారు. మంత్రిపైనే పోస్టులు పెడితే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై పోలీసులు సంబంధిత వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు.

అర్ధరాత్రి వరకు మాంసం విక్రయాలు



మాసం విక్రయాలు జరుపుతున్న దుకాణం

శివ్వంపేట(నర్సాపూర్): గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి వరకు మాంసం విక్రయాలు జరిగాయి. పైగా పెత్తర అమావాస్య పండుగ.. దివంగతులైన వారికి పూజలు చేసి మాంసంతో నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. దీంతో మాంసం కోసం రాత్రి వరకు జనం బారులుతీరారు.

కార్మికులకు సన్మానం



చేగుంట(తూప్రాన్): పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. బుధవారం చేగుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించి సన్మాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్, విజయ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పుష్పాభిషేకం



పోచమ్మకు పుష్పాభిషేకం నిర్వహించిన అర్చకులు

కొడిపల్లి మండలం.. తునికి నల్లపోచమ్మదేవికి బంతి పూలతో పుష్పాభిషేకం నిర్వహించారు. బుధవారం అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ తన పొలంలో పండిన పసుపు, ఎరుపు రంగు బంతిపూలతో అమ్మకు పుష్పాభిషేకం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు తీర్చుకున్నారు.

– కొడిపల్లి(నర్సాపూర్):

దివ్యదర్శనం



ప్రత్యేక అలంకరణలో బగలాముఖీ

అమావాస్య సందర్భంగా మండల కేంద్రంలోని బగలాముఖి శక్తిపీఠంలో బుధవారం వేద పండితుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిద్వార్చన, విశేష పూజలు, హోమం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

– శివ్వంపేట(నర్సాపూర్):

పసుపుతో.. అలంకరణ



విశేష అలంకరణలో అమ్మవారు

చేగుంటలో ఉన్న మహంకాళి అమ్మవారిని పసుపుతో అలంకరణ చేశారు. గురువారం నుంచి దేవిశరన్నవరాత్రుల ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అమ్మ విశేష అలంకరణలో కనువిందు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆపై మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– చేగుంట(తూప్రాన్):

కుక్కలు కరిచేస్తున్నాయ్..

- గ్రామాల్లో శునకాల వీరవిహారం
- పిల్లల నుంచి పెద్దల వరకు బాధితులే
- వాటి బెడదను నివారించాలని గ్రామాల ప్రజల వేడుకోలు



టేక్మాల్‌లో కుక్కల సమూహం



టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని కుక్కలు జనాలను హడలెత్తిస్తున్నాయి. ఎక్కడ చూసిన గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధులపై దాడికి తెగబడుతున్నాయి. మనిషిని చూస్తే చాలు భౌభౌ అంటూ మీదికొస్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులను సైతం వెంబడిస్తున్నాయి. వారు కింద పడి గాయాల పాలవుతున్నారు. మండలకేంద్రమైన టేక్మాల్‌తో పాటు సాలోజిపల్లి, బొడ్మట్‌పల్లి, కాద్లూర్, పల్వంచ, దనూర, కుసంగి, బర్దిపూర్, వెంకటాపూర్, దాదాయిపల్లి, ఎల్లుపేట తదితర గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. టేక్మాల్‌లో అయితే మందలు మందలుగా తిరుగుతున్నాయి. ఏ రోడ్డు గుండా చూసినా ఇవే కనిపిస్తున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు రోడ్లపై తిరగాలంటే జంకుతున్నారు. వాటి బెడద నివారణలో అధికారులు విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. పలుమార్లు ఈ విషయమై విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటి బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

నిదర్శనం

◆ టేక్మాల్ మండలం దాదాయిపల్లిలో నాలుగు నెలల క్రితం సరిత, దానయొల్ల శ్రీశైలం, బంగరిగ్ల వీరయ్యలపై వేర్వేరు ప్రాంతాల్లో కుక్క కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు.

◆ టేక్మాల్‌కు చెందిన దొడ్ల సంతోష్ వారం క్రితం కుక్కకాటుకు గురయ్యాడు. టేక్మాల్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు.

◆ టేక్మాల్ మండలం హసన్‌మ్మద్‌పల్లి, గొల్లగూడెంలలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా మృత్యువాత పడ్డాయి.

◆ టేక్మాల్ మండలం ఎల్లుపేటకు చెందిన ఓ యువకుడి బైక్‌ను కుక్కలు వెంబడిస్తే అతను కింద పడగా కాలికి.. చేయికి గాయాలయ్యాయి.

6 నెలల్లో 210 మందికి కుక్కకాటు

పాపన్నపేట(మెదక్): మండలంలో వీధి కుక్కలు వీర విహారం చేస్తున్నాయి. వాటిని చూసి పరుగులు తీస్తే వెంటపడి కరుస్తున్నాయి. మెదక్–బొడ్మట్‌పల్లి రోడ్డులో వాటి సంచారమే ఎక్కువగా కనిపిస్తోంది. మందలుగా తిరుగుతుండటంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఆరు నెలలలో 210 మందిని కుక్కలు కరిచాయి. దీంతో చిన్న పిల్లలను ఒంటరిగా బడికి పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళనకు లోనవుతున్నారు. రోడ్డుల మీద శునకాలు వెంట పడటంతో పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల పాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు వాటి కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.

సెప్టెంబర్ నెలలో.. బాధితులు

శ్రీవిద్య (అబ్లాపూర్), వెంకటేశ్ (కొత్తపల్లి), ఎల్లమ్మ, ఈశ్వరమ్మ (యూసుఫ్‌పేట) మల్లికార్జున్ (పల్వంచ), అరవింద్ (పొడిచన్‌పల్లి), శ్రవణ్‌కుమార్ (గాంధారిపల్లి), దుర్గమ్మ (నాగ్సాన్‌పల్లి), మణికంఠ, నారాయణ (నార్సింగి), బాలు (పొడిచన్‌పల్లి), శ్రీనివాస్ (కొత్తపల్లి), అంజవ్వ (పాపన్నపేట), శేఖర్ (రామతీర్థం), రాజు (నారాయణఖేడ్), లక్ష్మి (అర్కెల), హర్షవర్ధన్ (ఎంకెపల్లి), అపర్ణ (నార్సింగి) కుక్క కాటుకు గురయ్యారు. వారందరికి రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చినట్లు పాపన్నపేట సీహెచ్‌ఓ చందర్ నాయక్ తెలిపారు.

శరన్నవరాత్రికి ఆలయాలు ముస్తాబు



చిన్నశంకరంపేట (మెదక్):కొర్విపల్లిలో దుర్గామాత ఆలయం

నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లిలో ఉన్న దుర్గామాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈనెల 3 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి శివ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం ముస్తాబు చేశారు. గ్రామంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో 26 ఏళ్ల క్రితం ఆలయం నిర్మించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ప్రతీ యేటా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలు ముగిసే వరకు రోజూ కుంకుమార్చన, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టేక్మాల్(మెదక్): దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేశారు. మండలంలోని బొడ్మట్‌పల్లి ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో జరపనున్న ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిది రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు.

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో గల విద్యసరస్వతీదేవి, భ్రమారంబదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఉమాశంకరశర్మ, రవి ప్రసాద్‌శర్మ బుధవారం తెలిపారు. ఈనెల 3న బాలత్రిపురసుందరీదేవి, 4న కౌమారిదేవి, 5న గాయత్రీదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న లలితాదేవి, 8న మహాలక్ష్మిదేవి, 9న మహాసరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దినిదేవి, 12న రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారిని అలంకరిస్తామని తెలిపారు.



టేక్మాల్: బొడ్మట్‌పల్లిలో సిద్ధమైన మండపం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో దేవీ శరన్నరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెద్దశంకరంపేటలోని గడికోట, దుర్గమ్మ ఆలయం వద్ద, భవానీ మందిర్, శిశుమందిర్, ఆర్యవైశ్య సంఘం, పాత చావిడి రోడ్డుకు వెళ్లే దారితో పాటు రామోజిపల్లి, బుజ్రాన్‌పల్లి, ఉత్తులూర్, జూకల్ తదితర గ్రామాల్లో అమ్మవారి మండపాలను ఏర్పాటు చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ లాల్‌బహద్దూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయం



చేగుంట(తూప్రాన్): మాజీ ప్రధాని లాల్‌బహద్దూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఉపాధ్యాయులు కొనియాడారు. మండల కేంద్రమైన చేగుంటలోని ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆయన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, మనోహర్, పాండు, జగన్‌లాల్, వారాల నర్సింహులు, వెంకటేశ్, సిద్దిరాములు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ నాటిన మొక్కలను కాపాడాలి

నర్సాపూర్: నాటిన మొక్కలను కాపాడాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ చెప్పారు. బుధవారం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల, కాలేజీలో ఏక్‌పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా పలువురితో కలిసి మున్సిపల్ చైర్మన్ మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్క కాపాడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, మేనేజర్ మధుసూదన్, కాలేజీ ప్రిన్సిపాల్ రవి, లెక్చరర్లు మమత, శివశంకర్‌గౌడ్, కౌన్సిలర్లు యాదగిరి, రాంచందర్, సిబ్బంది పాల్గొన్నారు.



◆ తాగి వాహనాలు నడిపితే చర్యలు



రేగోడ్(మెదక్): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పోచయ్య హెచ్చరించారు. మండలంలోని పోచారం వద్ద బుధవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాల వెంట అన్ని ధ్రువపత్రాలు ఉండాలని సూచించారు. బైకిస్ట్ హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ మాజీ సర్పంచ్ మృతి



గౌడ్(ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటకు చెందిన మాజీ సర్పంచ్ గోకని ధర్మగౌడ్ (95) మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆయన మృతి పట్ల పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు నాయకులు సంతాపం తెలిపారు. ఆయనకు భార్య నర్సమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

◆ ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం

నర్సాపూర్ రూరల్: ప్లాస్టిక్ నిషేధ గ్రామంగా అవంచను తీర్చిదిద్దుదామని గ్రామ ప్రత్యేక అధికారి మధులత గ్రామస్తులకు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా గ్రామసభల ముగింపు, గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధి కూలీలకు కొత్త పనులు కల్పిస్తామని మధులత తెలిపారు. పాంపాండ్స్, ఇంకుడు గుంతలు తదితరుల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం మండలకేంద్రాలలో మహిళలు బతుకమ్మను రంగురంగుల పూలతో పేర్చారు. అందరూ ఒక చోటకు చేరి ఆడి పాడారు.



కొల్చారం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తూప్రాన్‌లో..

మహాత్ముని మార్గం అనుసరణీయం



మెదక్‌జోన్: రాందాస్ చౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



కొడిపల్లి: తునికిలో...



వెల్దుర్తి: వెల్దుర్తి–ఉప్పులింగాపూర్‌లో..

మహాత్ముని సేవలు అజరామరం అని వక్తలు కొనియాడారు. జాతిపిత జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతి, అహింసా, సత్యం మార్గాన ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన ధీశాలి అని గుర్తు చేసుకున్నారు. ఆయన మార్గం అనుసరణీయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సేవా, ప్రజా సంఘాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

–నెట్‌వర్క్



శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలో మహాత్ముడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



రామాయంపేట(మెదక్)లో...



మెదక్ మున్సిపాలిటీ: బీఆర్ఎస్ కార్యాలయంలో..



పెద్దశంకరంపేటలో..



నర్సాపూర్: ఆర్డీఓ కార్యాలయంలో..